క్లుప్తంగా

ఘనంగా మడివేలు మాచి దేవ జయంతి



జయంతి కార్యక్రమంలో పాల్గొన్న రజక సంఘాల నేతలు

కర్నూలు(అర్బన్): రజకుల కుల గురువైన మడివేల్ మాచి దేవ జయంతిని శనివారం స్థానిక బీసీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా మాచిదేవ చిత్ర పటానికి రజక సంఘాల నాయకులు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులు, రజక ఐక్య సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు వేంపెంట రాంబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాడాల నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రజకుల కుల గురువైన మడివేలు మాచిదేవ వీరభద్ర స్వామి అంశతో జన్మించారన్నారు. ఆయన ఆశీస్సులతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రజకులందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

ఐఎస్ఈఓ పరీక్షల్లో నారాయణ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపించిన విద్యార్థులు నారాయణ స్కూల్ ప్రిన్సిపల్ మహమ్మద్ అల్తాఫ్, తదితరులు

కర్నూలు సిటీ: కౌన్సిల్ ఫర్ న్యూట్రింగ్ అకాడమిక్ పొటెన్షియల్ ఇన్ స్టూడెంట్ అనే సంస్థ నిర్వహించిన ఇంటర్నెషనల్ స్పెల్ ఈ ఒలంపియాడ్(ఐఎస్ఈఓ) పరీక్షల్లో నారాయణ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపించారు. ఈ మేరకు మాధవీనగర్‌లోని ఆ స్కూల్ బ్రాంచ్‌కి చెందిన ప్రిన్సిపాల్ మహమ్మద్ అల్తాఫ్ శనివారం ఆ స్కూల్‌లో అభినందన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో తమ స్కూల్‌కి చెందిన ఆసియా ఫిరదౌసి రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు, కె.కౌసిక్ 7వ ర్యాంకు, నిహారిక 17వ ర్యాంకు, భవన డీప్ 18వ ర్యాంకు, రిషిత 25వ ర్యాంకు సాధించారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కర్నూలు కల్చరల్: సేవా భారతి, హెచ్‌డీసీటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఆర్‌ఎస్ రోడ్‌లోని హెచ్‌డీసీటీ హాస్పిటల్‌లో ఉచిత వైద్య సేవా శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ సి. శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో డాక్టర్ చల్లా వాసురెడ్డి, డాక్టర్ సుదర్శన్ రెడ్డి, రామారావు అతిథులుగా హాజరుకానున్నారని పేర్కొన్నారు.

హిమోఫీలియా బాధితులకు ఫిజియోథెరపీ

కర్నూలు(హాస్పిటల్):హిమోఫీలియా వ్యాధితో బాధపడుతున్న వారికి ఫిజియోథెరపీ చేయించడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని లక్ష్మీ వెంకటేష్ టీజీ ఫిజియోథెరపీ, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక సంకల్‌బాగ్‌లోని కళాశాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇంటాస్ ఫౌండేషన్ సహకారంతో హిమోఫీలియా బాధితులకు ఫిజియోథెరపీ చికిత్సతో పాటు, వారు ఏ విధంగా మెరుగైన జీవితాన్ని గడపవచ్చో డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి వివరించారు. ఫిజియోథెరపీ వల్ల చేకూరే ప్రయోజనాలు, చేయకపోతే పర్యవసనాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో దంత వైద్యులు డాక్టర్ చైతన్య, కర్నూలు చాప్టర్ హిమోఫీలియా సొసైటీ అధ్యక్షుడు పార్థసారథి, కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాలలను సీజ్ చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఒకే ప్రాంగణంలో నిబంధనలకు విరుద్ధంగా ఆయుష్మాన్, మదర్ థెరిస్సా నర్సింగ్ కళాశాలలను నడుతుపున్న యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, ఆ కళాశాలల గుర్తింపును రద్దు చేసి సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా డిమాండ్ చేశారు. శనివారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆ రెండు కళాశాలలు నిబంధనలు పాటించకున్నా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు పట్టించుకోవడంలేదన్నారు. కార్యక్రమంలో అబుబకర్, మల్లేష్ పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : సంక్రాంతికి వస్తున్నాం, డాకు మహరాజ్, మద గజరాజ,దేవ,రాచరికం
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : సంక్రాంతికి వస్తున్నాం, డాకు మహరాజ్, మద గజరాజ, గేమ్ ఛేంజర్, పుష్ప–2 : ది రూల్ రీలోడెడ్, మహిష, ఏజెంట్ గై 001, రాచరికం, ప్రేమిస్తావా
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : సంక్రాంతికి వస్తున్నాం ,డాకు మహరాజ్,మద గజరాజ
శ్రీరామ : గేమ్ ఛేంజర్
రాజ్ : మద గజరాజ
భరత్ కాంప్లెక్స్ : పుష్ప–2 : ది రూల్ రీలోడెడ్, రొమాంటిక్ లైఫ్, మహిష
విజయ థియేటర్ : సంక్రాంతికి వస్తున్నాం

కీళ్లవాతం.. నడవాలంటే నరకం!

- అధికమవుతున్న రుమటాయిడ్ కేసులు
- మధ్యవయస్సులో పట్టిపీడిస్తున్న సమస్య
- పలు రకాల ఇన్ఫెక్షన్లు, జీవనశైలే కారణం
- ప్రతి వంద మందిలో ఐదుగురు బాధితులు
- నేడు రుమటాయిడ్ ఆర్థరైటిస్ అవగాహన దినం





కర్నూలు(హాస్పిటల్): శరీరంలో ప్రతి చోటా ఉన్న కీళ్లలో నొప్పి. కదలలేని, నడవలేని పరిస్థితి. అన్ని కీళ్లు బిగుసుకుపోతాయి. ఉదయం లేచి నడవాలంటే నరకం కనిపిస్తుంది. కాస్త విశ్రాంతి తీసుకుని నడవాలన్నా ఇబ్బందులే. ఇలాంటి సమస్యలతో ఇటీవల కాలంలో చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. అన్ని కీళ్లల్లో వాతం చేరుకోవడంతో ఈ సమస్య వస్తోంది. పలురకాల ఇన్ఫెక్షన్లు, జీవనశైలిలో మార్పులు, మారిన ఆహారపు అలవాట్లే దీనికి కారణమని వైద్యులు చెబుతున్నారు. ఈ నెల 2న రుమటాయిడ్ ఆర్థరైటిస్(కీళ్లవాతం) అవగాహన దినం సందర్భంగా ప్రత్యేక కథనం.

ఏదిపడితే అది తినడంతోనే సమస్య

రుమటాయిడ్ ఆర్థరైటిస్ అనే పదం చాలా మందికి తెలియదు. కీళ్లవాతమంటే అప్పట్లో ఉన్న పెద్దవారికి మాత్రమే తెలిసేది. వాతమంటే నొప్పి. కీళ్లవాతమంటే కీళ్లలో నొప్పిగా అప్పట్లో భావించేవారు. కొంత మంది వీటిని వాయి నొప్పులు అని కూడా పేర్కొనేవారు. ఇందుకు కొన్ని రకాల ఆహార పదార్థాలను తినకూడదని చెప్పేవారు. ఫలానా ఆహార పదార్థం తింటే నీకు వాయి వస్తుంది హెచ్చరించేవారు. కానీ ఇప్పుడు అన్ని రకాల ఆహార పదార్థాలతో పాటు డబ్బు కూడా అందుబాటులోకి ఉండటం, ఇంట్లో మంచి చెప్పే పెద్దవారు లేకపోవడంతో ఏది పడితే అది తినేస్తున్నారు. ఫలితంగా కీళ్లవాతం సమస్యతో బాధపడుతున్నారు. వాస్తవానికి తీసుకున్న ఆహారం జీర్ణం అయిన తర్వాతే మళ్లీ తినాలి. కానీ తిన్నది జీర్ణం కాకముందే మళ్లీ మళ్లీ ఆహారం తీసుకోవడం, సమయానికి ఆహారాన్ని తీసుకోకపోవడం వల్ల జీర్ణవ్యవస్థ దెబ్బతింటోంది. తిన్న ఆహారం కూడా సరిగ్గా జీర్ణం కాకపోవడం వల్ల అది విషం(ఆమం)గా మారి శరీరంలో ప్రసరించి వాతాన్ని కలిగిస్తుంది. అది ప్రకోపించి అన్ని కీళ్లలో చేరి నొప్పి, వాపును కలుగజేస్తుంది.

కీళ్లవాతమంటే...

రుమటాయిడ్ కీళ్లనొప్పులు అనేది కీళ్లచుట్టూ ఉన్న ఎముకలు, కండరాలు, టెన్డాన్లను, లిగమెంట్లను ఏకకాలంలో ప్రభావం చేస్తూ ఆ ప్రదేశాల్లో కీలు బిగుతుగా ఉంటూ భరించలేని నొప్పి ఒక కీలు నుంచి మరోదానికి మారుతూ ఉంటుంది. ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లా జనాభాలో ఐదు శాతం మందికి పైగా అంటే దాదాపు 2,40,000 మందికి పైగా ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు వైద్యుల అంచనా. మొదట్లో దీని బారిన పడే వారు అధికంగా పట్టణాల్లో మాత్రమే ఉండేవారు. ఇప్పుడు పట్టణాలు, గ్రామాలు అన్న తేడా లేకుండా ఈ వ్యాధి పీడిస్తోంది.

కీళ్లవాతానికి కారణాలు

దీనిని ఆటో ఇమ్యూన్ డిజార్డర్‌గా పిలుస్తారు. అంటే మన శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ మనపై వ్యతిరేకంగా పనిచేస్తుందన్నమాట. మన శరీరంలోని రక్షణ వ్యవస్థ మనల్ని రక్షించడానికి బదులు శరీరంలోని కణజాలాలు, కీళ్లపై దాడి చేసి అక్కడ నొప్పి, వాపును కలుగజేస్తాయి. దీంతో పాటు అంటువ్యాధులు, హార్మోన్ల మార్పులు, మానసిక ఒత్తిళ్లు, ధూమపానం, కాలుష్యకారకాల వల్ల కూడా కీళ్లవాతం వచ్చేందుకు అవకాశాలు ఉన్నాయి. ఈ సమస్యను ఆధునిక పరిభాషలో రుమటాయిడ్ ఆర్థరైటిస్ అంటారు.

వ్యాధి లక్షణాలు

- ఉదయం పూట కీళ్లు బిగుతుగా ఉంటాయి. వాటిని కదిలించేందుకు ఇబ్బందిగా, విపరీతంగా నొప్పులు ఉంటాయి.
- చర్మంపై దద్దుర్లు, అలసట, రక్తహీనత, కళ్లు, నోరు పొడిబారడం, మోచేతులు, చేతులు, మోకాలు, ఇతర కీళ్లలో గట్టిగా గడ్డలు లాంటివి ఉంటాయి.
- తేళ్లు కుట్టినట్లు అన్ని కీళ్లలో నొప్పులు, వాపు రావడం. రుచి తెలియకుండా ఉండటం, దాహం అధికంగా వేయడం, ఏ పనీ చేయాలని అనిపించకపోవడం, ఒళ్లంతా బరువుగా ఉండటం, జ్వరంగా ఉండటం, వంటి లక్షణాలు కనిపిస్తాయి.

కీళ్లవాతం దుష్పరిణామాలు

- రక్తహీనత, డిప్రెషన్, గుండెకు సంబంధించిన వ్యాధులు, వెన్నుముక కీళ్ల కుదింపు, పొడిబారిన, ఎర్రటి, దురదతో కూడిన కళ్లు.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు

- ప్రభావిత కీళ్లకు శారీరక పరీక్ష
- ఆర్ఏ ఫ్యాక్టర్, యాంటి సీసీపీ రక్తపరీక్షలు
- ఎక్స్‌రే

వ్యాధి నివారణ మార్గాలు

మసాల ఆహారానికి, కూల్‌డ్రింక్స్‌కు దూరంగా ఉండటం, మాంసాహారం, నిల్వ ఉంచిన పదార్థాలు తినకపోవడం, మినుములతో చేసిన పదార్థాలు, జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి. చల్లని వాతావరణంలో జాగ్రత్తలు తీసుకోవడం, రాత్రిపూట నిద్ర మేల్కోకుండా ఉండాలి.

అందుబాటులో ప్రత్యేక వైద్యులు

కీళ్లవాతం సమస్యను సైతం అప్పట్లో ఆర్థోపెడిక్ లేదా జనరల్ ఫిజిషియన్లు చికిత్స చేసేవారు. ఇప్పుడు ఈ సమస్యకు కూడా ప్రత్యేక వైద్యులు రుమటాలజిస్టుగా పేర్కొనే వైద్యులు వచ్చారు. ఐదేళ్ల క్రితం వరకు ఇలాంటి వైద్యుల కోసం హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చేది. ఆ తర్వాత నుంచి హైదరాబాద్ నుంచే నెలకు ఒకసారి సదరు స్పెషలిస్టు కర్నూలు వచ్చి రోగులకు చికిత్స చేసి వెళ్లేవారు. ఇలాంటి వారితో పాటు ఇప్పుడు కర్నూలులో కూడా రుమటాలజిస్టులు ఇక్కడే ఆసుపత్రి, క్లినిక్‌లు ఏర్పాటు చేసుకుని చికిత్స అందిస్తున్నారు. ఈ కారణంగా ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన మరింత పెరుగుతోంది.

రెగ్యులర్‌గా మందులు వాడాలి



రుమటాయిడ్ ఆర్థరైటిస్ ఒక దీర్ఘకాలిక ఆరోగ్య సమస్య. దీనికి వైద్యులను సంప్రదించి వారు సూచించిన మేరకు అలవాట్లు మార్చుకుని, మందులు వాడుతూ ఉంటే నియంత్రణలో ఉంటుంది. వైద్యులకు చెప్పకుండా మందులు ఇష్టానుసారం వాడటం, మధ్యలో ఆపేయడం చేస్తే సమస్య మళ్లీ మొదటికి వస్తుంది. దీనివల్ల ఇతర అవయవాలు కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ వ్యాధికి ఇప్పుడు ఆధునిక మందులు అందుబాటులోకి వచ్చాయి. వాటి ద్వారా వ్యాధిని నియంత్రణలోకి తీసుకురావడం సులభం.

–డాక్టర్ సృజన, రుమటాలజిస్టు, కర్నూలు

హోమియో మందులతో రుమటాయిడ్ అదుపులోకి



రుమాటిజంతో బాధపడే వారికి హోమియోపతి ఎంతో సురక్షితమైన, ప్రభావితమైన చికిత్సను అందిస్తుంది. పలు కారణాల వల్ల మన వ్యాధినిరోధక శక్తే శరీరంలోని ఎముకలు, కండరాలు, కీళ్ల వ్యవస్థలను దెబ్బ తీస్తుంది. దీనివల్ల దీర్ఘకాలిక నొప్పి వస్తుంది. తద్వారా ఎముకలు, కీళ్లు, కండరాల్లో వచ్చిన మార్పులు సంభవించి ఎన్నో ఇబ్బందులతో బాధపడుతూ ఉంటారు. దీనికి హోమియోపతిలో లక్షణాల మూలానికి వెళ్లి శరీర సహజ వ్యాధినిరోధక సామర్థ్యాన్ని స్థిరపరిచే ప్రభావవంతమైన మందులు ఉన్నాయి. ఇవి ఈ రుగ్మత నుంచి ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా ఉపశమనం ఇవ్వడంలో సహాయపడతాయి.

–డాక్టర్ వసంతసాగర్, సీనియర్ హోమియోపతి వైద్యురాలు, కర్నూలు

ఇంటి స్థలాల బాధితులకు న్యాయం చేయండి



డీఎల్‌సీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న 4వ తరగతి ఉద్యోగుల బాధితులు

కర్నూలు(అగ్రికల్చర్): నాలుగవ తరగతి ఉద్యోగుల ఇంటి స్థలాల బాధితులకు జిల్లా సహకార అధికారులు తగిన చర్యలు తీసుకొని సత్వరం న్యాయం చేయాలని ప్రజా పరిరక్షణ సమితి (నాలుగో తరగతి ఇంటి స్థల బాధితుల ఐక్యవేదిక) ప్రతినిధులు డిమాండ్ చేశారు. బాధితుల గోడును సంబంధిత అధికారులు పట్టించుకోనందుకు నిరసనగా శనివారం కృష్ణానగర్‌లోని సహకార శాఖ కర్నూలు డివిజనల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ... 4వ తరగతి ఉద్యోగుల హౌస్ బిల్డింగ్ సొసైటీని జిల్లా యంత్రాంగం రద్దు చేసి.. ఈ స్థానంలో ముగ్గురు సహకార అధికారులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసిందన్నారు. అయితే ఈ బృందం ఇంతవరకు బాధితుల గురించి ఏ మాత్రం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులను పట్టించుకోకుండా సొసైటీ దివాల తీయడానికి కారణమైన వారికే ఈ బృందం వత్తాసు పలుకుతోందని వాపోయారు. జిల్లా అధికారులు సత్వరం చర్యలు తీసుకొని బాధితులకు తగిన న్యాయం చేయాలన్నారు.

పిల్లలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలి

కర్నూలు(హాస్పిటల్): పిల్లలకు తప్పనిసరిగా వ్యాధినిరోధక టీకాలు ఇప్పించాలని డెమో శ్రీనివాసులు శెట్టి సూచించారు. శనివారం స్థానిక వడ్డేగేరి యూపీహెచ్‌సీ పరిధిలోని ఖడక్‌పురలోని 27వ సచివాలయంలో నిర్వహించిన టీకాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు, పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు భవిష్యత్‌లో ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా రక్షణ కల్పిస్తాయన్నారు. అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాల తర్వాత మాత్రమే వివాహాలు చేయాలని, లేకపోతే చిన్నవయస్సులో గర్భధారణ వల్ల గర్భస్రావం, మృతశిశువు జననం, బరువు తక్కువ పిల్లలు జన్మించడం, తల్లికి తీవ్ర హీనత వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధి అబ్బాస్‌మియా, ఆరోగ్య కార్యకర్త పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- డీఈఓ శామ్యూల్‌పాల్



పది ఫలితాలపై ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈఓ శామ్యూల్‌పాల్


కోడుమూరు రూరల్: పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని డీఈఓ శామ్యూల్‌పాల్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం స్థానిక బాలికల హైస్కూల్‌ను డీఈఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల రికార్డులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. కాసేపు విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలంటే భయం వీడాలని సూచించారు. సమయం చాలా ఉందని, ప్రణాళిక ప్రకారం చదువుకుంటే విజయం సులభమవతుందని చెప్పారు. అనంతరం ఉపాధ్యాయులతో డీఈఓ సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ప్రతి సబ్జెక్టులోనూ మంచి మార్కులు వచ్చేలా కృషి చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతుల ద్వారా సులువైన పద్ధతిలో బోధించి ప్రతి విద్యార్థి పాసయ్యేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగరాజకుమారి ఉన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి


సి.బెళగల్: మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల నిర్వాహకులకు సూచించారు. శనివారం ఆమె ఎంపీడీఓ రాణెమ్మతో కలిసి మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను, తరగతి గదులను శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. టీచర్లతో సమావేశమైన పలు సూచనలు చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో సమావేశమై పాఠ్యాంశాలలోని విషయంపై పూర్తి అవగాహన పెంచుకోవాలని, భయం వీడి పరీక్షల్లో ఉత్తీర్ణతే లక్ష్యంగా చదవాలని సూచించారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం నాణ్యతగా లేకపోవడం, తాగు నీరు అందుబాటులో లేకపోవడం, హాస్టల్ పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో సిబ్బందిపై డీడీ మండిపడ్డారు. పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయ ఉద్యోగులు చేపట్టిన పింఛన్ పంపిణీ, గోకులం షెడ్ల నిర్మాణాలను పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

- సమయానికి రాని అంబులెన్స్
- అరగంట పాటు రోడ్డుపైనే క్షతగాత్రులు



గాయపడిన రమేష్



వెంకటరమణ



ప్రమాద స్థలి వద్ద గుమిగూడిన ప్రజలు

పాణ్యం: మండల పరిధిలోని బలపనూరు–శాంతిరామ్ ఆస్పత్రి మధ్య జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. నంద్యాలకు చెందిన రమేష్, గడిగరేవుకు చెందిన వెంకటరమణ ప్రైవేట్ విత్తన కంపెనీలో పని చేస్తున్నారు. శనివారం ఓ పని నిమిత్తం పాణ్యం వచ్చి మధ్యాహ్నం బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. శాంతిరామ్ ఆస్పత్రి సమీపంలో జరుగుతున్న పవర్‌గ్రిడ్ పనులకు నీరు తీసుకెళ్తున్న ట్యాంకర్ హఠాత్తుగా ఎడమవైపు తిరగడంతో వెనుక నుంచి వస్తున్న బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో రమేష్, వెంకటరమణకు గాయాలయ్యాయి. వాహనదారులు అంబులెన్స్‌కు కాల్ చేసినా రాకపోవడంతో అరగంట పాటు రోడ్డుపైనే క్షతగాత్రులు సహాయం కోసం ఎదురుచూశారు. ఆ తర్వాత రమేష్‌ను బైక్‌పై తీసుకెళ్లి శాంతిరామ్ ఆస్పత్రిలో చేర్పించారు. వెంకటరమణను హైవే అంబులెన్స్‌లో శాంతిరామ్‌కు తరలించారు.

97.19 శాతం పింఛన్ల పంపిణీ

కర్నూలు (టౌన్) : నగరంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 97.19 శాతం పంపిణీ చేశారు. నగరంలోని ఆరోరానగర్‌లో మేనేజర్ చిన్నరాముడు లబ్ధిదారులకు పెన్షన్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ నగరంలో 137 సచివాలయాల పరిధిలో 35,421 మంది లబ్ధిదారులకు గాను సాయంత్రానికి 34, 423 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు చెప్పారు.

ఝాన్సీలక్ష్మికి సీపీఐ నివాళి

కర్నూలు(సెంట్రల్): ప్రకాశం జిల్లా కొండేపి సీపీఐ నాయకురాలు ఝాన్సీలక్ష్మి మృతికి పార్టీ నగర కమిటీ సంతాపాన్ని తెలుపుతున్నట్లు కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె కొండేపిలో పార్టీ కార్యాలయం కోసం స్థలాన్ని ఇచ్చారని, ఆమె మృతి పార్టీకీతీరని లోటన్నారు.

నూతన వైద్యులకు ఈఎన్‌టీ వర్క్‌షాప్



నూతన వైద్యులకు శిక్షణ ఇస్తున్న డాక్టర్ జయప్రకాష్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): నూతన వైద్యులకు కర్నూలులోని ఎస్ఆర్ పేటలో ఉన్న శ్రీ సత్యసాయి ఈఎన్‌టీ హాస్పిటల్‌లో శనివారం 35వ హ్యాండ్స్ ఆన్ ఆసిక్యులో ప్లాస్టీ ఈఎన్‌టీ శస్త్రచికిత్సల వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ అధినేత డాక్టర్ బి. జయప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ఆదివారం కూడా ఈ వర్క్‌షాప్ కొనసాగుతుందన్నారు. తాను క్రమం తప్పకుండా గత 16 సంవత్సరాలుగా క్లిష్టతరమైన , నైపుణ్యంతో కూడిన ఈఎన్‌టి శస్త్రచికిత్సలపై నూతన వైద్యులకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న బెటాలియన్ కమాండెంట్ ప్రభుకుమార్, అసోసియేషన్ సభ్యులు

కర్నూలు : ఏపీఎస్పీ కర్నూలు రెండవ పటాలం పోలీసు అధికారుల సంఘం 2025 క్యాలెండర్, డైరీని కమాండెంట్ ప్రభుకుమార్ ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు పెద్దన్న, ప్రధాన కార్యదర్శి బీఎస్ హరిశ్చంద్రుడు, అసోసియేషన్ సభ్యులతో కలసి శనివారం పటాలంలోని కమాండెంట్ కార్యాలయంలో ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. అడిషనల్ కమాండెంట్ నాగేంద్రరావు, అసిస్టెంట్ కమాండెంట్లు ఎస్ఎం బాషా, ఎస్‌కే షఫ్రుద్దిన్, డీఎస్పీ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏపీ క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా రిత్విక్ కళ్యాణ్



కర్నూలు (టౌన్) : అండర్– 14 విభాగంలో ఆంధ్రప్రదేశ్ క్రికెట్ జట్టుకు నగరానికి చెందిన వై.రిత్విక్ కళ్యాణ్ ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం ఎస్ఆర్ పేటలో ఉన్న శ్రీలక్ష్మి పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ దీక్షిత్ మాట్లాడుతూ అమలాపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రికెట్ పోటీల్లో రిత్విక్ కళ్యాణ్ జిల్లా జట్టు తరపున పాల్గొని 204 పరుగులు చేసి, 5 వికెట్లు సాధించారన్నారు. దీంతో జాతీయ స్థాయిలో పాట్నాలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికయ్యాడన్నారు.

బేసిక్ పోలీసింగ్ తప్పనిసరి



కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలసి మొక్కను అందిస్తున్న నూతన ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు : బేసిక్ పోలీసింగ్ తప్పనిసరి... అందుకోసం నిబద్ధతతో పనిచేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులను ఆదేశించారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే శనివారం డీపీఓలోని వ్యాస్ ఆడిటోరియంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతిరోజూ సెక్షన్ల వారీగా స్టేషన్లలో రోల్‌కాల్ నిర్వహించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు పెరగడానికి ప్రధాన కారణం మద్యం సేవించి వాహనాలు నడపటమేనని, డ్రంకెన్ డ్రైవ్‌తో పాటు ఓపెన్ డ్రింకింగ్‌పై ఇకపై నిరంతరం తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. అలాగే నేరాల నియంత్రణ కోసం రాత్రి గస్తీ ముమ్మరం చేయాలని సూచించారు. సమస్యలపై స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం వాహన తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. అతివేగం, నిర్లక్ష్యం డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, రోడ్డు నిబంధనలను ఉల్లంఘించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తూ.. చలానాలు వసూలు చేయాలన్నారు. ప్రతి కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. అలాగే స్టేషన్ల వారీగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి అధికారి చర్యలు తీసుకోవాలని సూచించారు. సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీలు హుసేన్ పీరా, కృష్ణమోహన్, డీఎస్పీలు వెంకటరామయ్య, బాబుప్రసాద్, ఉపేంద్ర బాబు, ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ పాల్గొన్నారు. అంతకుముందు జిల్లా జడ్జి కబర్ధి, డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా తదితరులను నూతన ఎస్పీ విక్రాంత్ పాటిల్ మర్యాదపూర్వకంగా కలిశారు.

రేపు విధుల్లో చేరనున్న కమాండెంట్



ఎం.దీపికా పాటిల్

కర్నూలు : ఏపీఎస్పీ కర్నూలు రెండో బెటాలియన్ కమాండెంట్‌గా నియమితులైన ఎం.దీపిక పాటిల్ సోమవారం విధుల్లో చేరనున్నారు. ఈ మేరకు పటాలం అధికారులు ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేస్తున్న ఈమెను కర్నూలు 2వ బెటాలియన్ కమాండెంట్‌గా నియమిస్తూ గత నెల 20వ తేదీ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇక్కడున్న రవికుమార్ గతేడాది సెప్టెంబర్ 30న పదవీ విరమణ పొందారు. అప్పటి నుంచి అనంతపురం 14వ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రభుకుమార్ ఇన్‌చార్జ్ కమాండెంట్‌గా వ్యవహరిస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ పీ రంజిత్‌బాషా

కర్నూలు(అర్బన్): ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ముద్రించిన 2025 నూతన సంవత్సరం డైరీని జిల్లా కలెక్టర్ పీ రంజిత్‌బాషా ఆవిష్కరించారు. శనివారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు హరిదాసు ఈరన్న, ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా ఆయా సామాజిక వర్గాలకు చెందిన పేద విద్యార్థుల ఉన్నత విద్యకు సభ్యులందరి సహకారంతో ఆర్థిక చేయూతను కూడా అందిస్తున్నామన్నారు.

రవీంద్ర విద్యార్థులకు బహుమతులు

కర్నూలు (సిటీ) : స్థానిక అబ్బాస్ నగర్‌లోని రవీంద్ర పాఠశాలల విద్యార్థులు శనివారం కేఎల్ యూనివర్సిటీలో ఐడియా థాన్ 2కె25 పేరుతో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనపరచి రాష్ట్రస్థాయిలో బహుమతులు సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 జట్లు పాల్గొనగా కర్నూలు నగరంలోని రవీంద్ర బాలికల పాఠశాల (ఆర్‌పీఎస్) విద్యార్థినులు హఫీఫా, సమీరా, లిఖిత ఉత్తమ ప్రతిభ కనపరచి టాప్ 10లో నిలిచారు. వీరు డ్యూయల్ పర్పస్ వీల్ చైర్ స్ట్రెచర్ బెడ్ ఫర్ హాస్పిటల్స్ అనే నమూనాను తయారు చేసి బహుమతి సాధించారు. అలాగే రవీంద్ర ఐసీ విభాగం నుంచి ఆదిత్య, స్నేహిల్, గురు వీరచరణ్‌లు రూపొందించిన ఉమెన్ సేఫ్టీ డివైజ్ అను నమూనాకు నగదు బహుమతిని అందుకున్నారు. విద్యార్థులను రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య, రవీంద్ర విద్యాసంస్థల చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్, అకడమిక్ అడ్వైజర్ డాక్టర్ మమతా మోహన్, వైస్ చైర్మన్ జి.వంశీధర్ అభినందించారు.

9న వికాస భారతి ‘నారీ శక్తి చైతన్య సమ్మేళనం’

కర్నూలు కల్చరల్: వికాస భారతి ఉమ్మడి జిల్లా ధార్మిక సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన ‘నారీ శక్తి చైతన్య సమ్మేళనం’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఓర్వకల్ మండల పరిధి కాల్వ బుగ్గ సమీపంలోని సురభి గోశాల భారతీయ స్ఫూర్తి కేంద్రంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఉదయం గోపూజతో కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. మొదటి సెషన్‌లో ‘వివిధ సందర్భాలలో మన పూర్వీకులు పోషించిన పాత్ర’ అనే అంశంపై వికాస భారతి వ్యవస్థాపకులు బీవీ నాగేంద్ర ప్రసాద్ ముఖ్య వక్తగా ప్రసంగిస్తారని తె లిపారు. రెండవ సమావేశంలో ‘విలువలతో కూడిన సమాజ నిర్మాణంలో స్త్రీ పాత్ర’ అనే అంశంపై జి. భారతీయం సత్యవాణి ప్రధాన వక్తగా హాజరై ఉపన్యసిస్తారని పేర్కొన్నారు. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ డాక్టర్ కె. దేవకి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

నేడు ‘వసంత పంచమి’ వేడుకలు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో వసంత పంచమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. లలితా సుందరేశ్వరిని సరస్వతీ మాతగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిస్తామని తెలిపారు. విద్యార్థులు, భక్తులతో అష్టోత్తర పూజ, అక్షరాభ్యసం కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.